విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో శ్రీ జ్ఞాన సరస్వతి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో విజయరాంపురం గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల(ఎంపియుపి)ల్లో పిల్లలను జాయిన్ చేయాలని కోరుతూ ప్రచారం చేపట్టారు. బూరిపేట, అప్పలమ్మపేట, గొలుగువలస గ్రామాల పిల్లలను వారి తల్లిదండ్రులను గ్రామ పెద్దలను గురువారం ప్రధానోపాధ్యాయులు బి.నారాయణరావు సమక్షంలో ఇంటింటికీ వెళ్లి కలవడం జరిగింది. 3 గ్రామాల నుంచి దాదాపు 18 అడ్మిషన్స్ వచ్చాయి. ఈ కార్యక్రమంలో విజయరాంపురం గ్రామ సర్పంచ్ బూరి మధుసూదన రావు, గ్రామపెద్దలు, సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మళ్లీ తెరపైకి జిందాల్ ఉద్యమం

- రైతుల నుంచి సేకరించిన భూములను ఇవ్వాలని డిమాండ్
- పరిశ్రమల పేరుతో జిందాల్ సేకరించిన భూమి నిరుపయోగం
- ప్రభుత్వాలు మారినా పట్టించుకోని వైనం
- తాజాగా ఎమ్మెల్సీ రఘురాజు ఆధ్వర్యంలో మరోసారి ఉద్యమం

విశాలాంధ్ర - విజయనగరం: జిల్లాలోని శృంగవరపుకోట మండలంలోని బొడ్డవర ప్రాంతంలో దాదాపు 15 ఏళ్ల క్రితం జిందాల్ కర్మాగారం ఏర్పాటు చేస్తామని చెప్పి స్థానికంగా ఉన్న రైతుల నుంచి దాదాపు 15 వందల ఎకరాలకు పైగా భూములను నాటి ప్రభుత్వం సేకరించి కంపెనీ యాజమాన్యంకు అప్పగించింది. అయితే నాటినుంచి ఒక్క అడుగు కూడా కంపెనీ నిర్మాణంకు ముందుకు పడలేదు. దీంతో స్థానికంగా ఉన్న నిరుద్యోగులు ఆవేదన చెందుతున్నారు.

మరోసారి ఉద్యమిస్తున్న రైతాంగం

జిందాల్ కర్మాగారం ఏర్పాటుకు తమ భూములను ఇచ్చిన రైతులు నిబంధనల మేరకు వారికి కంపెనీలో ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూసారు. కానీ ఏళ్ళ తరబడి ఎదురు చూపులే మిగలడంతో ఎప్పటికప్పుడు తమ ఆందోళన తెలియజేస్తున్నారు. ఈ ప్రాంతానికి నేతగా ఉన్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆది నుంచి జిందాల్‌పై పోరుబాటలో నాయకత్వం వహిస్తున్నారు. గతంలో జిందాల్ భూములలో నాగళ్ళు పట్టి దున్నించి తమ నిరసన తెలిపారు. పరిశ్రమలు ఏర్పాటు చేయకపోతే తిరిగి రైతులకు భూములను అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎప్పటికప్పుడు జిందాల్ యాజమాన్యం సమస్యను పరిష్కరించకుండా నాన్చుడి వైఖరి అవలంబిస్తోంది.

ఉద్యమించనున్న రైతులు

జిందాల్‌పై మరోసారి పోరుబాటను రైతులు పట్టనున్నారు. తమ భూములను తిరిగి ఇవ్వాలని కోరుతూ గురువారం రఘురాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఇకపై తమతో పాటు ఉద్యమమంలో వామపక్షాల నేతలను సైతం కలుపుకుని వెళ్ళాలని నిర్ణయి ంచారు. అందులో భాగంగా సీపీఐ రాష్ట్ర నేత పి.కామేశ్వరరావును, సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారా యణను సైతం తమ సమావేశానికి ఆహ్వానించి తమకు మద్దతు ఇవ్వాలని రైతులు కోరారు. అందరితో కలిసి రఘు రాజు మరోసారి జిందాల్ పోరుబాటను తెరపైకి తెస్తున్నారు.

బాల కార్మికుల నిర్మూలనకు

టాస్క్‌ఫోర్స్ కమిటీలు

కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్: జిల్లాలో బాల కార్మికులు పని చేయకుండా చూడాలని జిల్లా కలెక్టర్ డా. బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. జూన్ 2 నుండి 30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా బాల కార్మికుల పునరావాసం కోసం ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నట్లు తెలిపారు. అందుకోసం జిల్లా స్థాయి, డివిజనల్ స్థాయిలో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ సభ్యులు జిల్లా అంతటా ఒకే సమయంలో దాడులు చేయాలని తెలిపారు. గురువారం కలెక్టర్ తన ఛాంబర్‌లో జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందుగా ప్రమాద కరమైన సంస్థలు, స్థలాల్లో పని చేస్తున్న బాల కార్మికులను రెండు రోజుల్లోగా గుర్తించాలన్నారు. ఎక్కడైనా బాల కార్మికులను గుర్తిస్తే వెంటనే పని చేయించే యజమానిపై ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయాలని తెలిపారు. నెల రోజుల పాటు జిల్లా అంతటా టాస్క్ ఫోర్స్ కమిటీలు ఒకే సమయంలో దాడులు జరపాలని తెలిపారు. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ మురళి, డిప్యూటీ కమీషనర్ ఆఫ్ లేబర్ ప్రసాదరావు, ఐ.సి.డి.ఎస్ పి.డి రుక్సానా బేగం, డిస్ట్రిక్ట్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్పర్సన్ హిమ బిందు, డీసీపీఓ లక్ష్మీ, డీఎస్‌పి, ఎన్.సి.ఎల్.పి, బెజ్జిపురం యూత్ క్లబ్, నేచర్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కోర్టు సముదాయం భవన నిర్మాణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - బొబ్బిలి: కోర్టు సముదాయం భవన నిర్మాణ పనులను ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జే.హేమ శ్రవంతి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ఆనందకుమార్, ఉపాధ్యక్షులు ఆర్.వి.ఎస్.ఎస్.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బి.ఎస్.ఆర్. మూర్తి, ఇతర కార్యవర్గ సభ్యులు, మాజీ అధ్యక్షులు పి.మోహన మురళీ కుమార్, జి.జి.కె.ఎస్.శర్మ, న్యాయవాదులు అమరాపురం రామకృష్ణ, జాగారాపు శ్రీనివాసరావు, సి.పి.డెబిల్యు.ఇంజనీర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత

విశాలాంధ్ర - బొబ్బిలి : పట్టణం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పెద్ద ఎత్తున గుంతలు పడి అనేక మంది ప్రమాదం బారిన పడుతున్నారు. అయితే దీనిపై రహదారి భవనాలు శాఖ అధికారులు స్పందించి గుంతలు పూడ్చాల్సి ఉంది. ఈ అధికారులు స్పందించకపోవడంతో ప్రమాదాలు నివారించేందుకు పట్టణ సీఐ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్సై జ్ఞాన ప్రసాద్, సిబ్బంది గుంతలు పూడ్చారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం పట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

రైతు గుర్తింపు కార్డులపై అవగాహన

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: మండలంలోని ధర్మవరం, సంత గైరమ్మపేట గ్రామాల్లో కౌలు రైతుల అవగాహన, గుర్తింపు కార్డుల కొరకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్.కోట మండల వ్యవసాయ శాఖ అధికారి కే.రవీంద్ర కౌలు రైతులు గుర్తింపు కార్డు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్డు ద్వారా అన్నదాత సుఖీభవ, పంట నమోదు, దాన్యం కొనుగోలు, పంట నష్టం, పంట భీమా వంటి లాభాలు పొందవచ్చన్నారు. ఈ కార్య క్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎల్.రవి, ఎం.శిరీష్, వీఆర్వో సుదీర్, అడవినాయుడు, గ్రామ సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన యోగాంధ్ర ర్యాలీ

విశాలాంధ్ర - మెంటాడ: ఎంపీడీవో భానుమూర్తి ఆధ్వర్యంలో 550 మంది వివిధ శాఖల ఉద్యోగులతో ప్రజలను అబ్బురుపరిచేలా యోగాపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ఆరోగ్యమే మహా భాగ్యంగా వర్ధిస్తూ ప్రతి ఒక్కరి జీవితంలో యోగ సమభాగం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప తహశీల్దార్ వెంకట్రావు, పంచాయతీ విస్తరణాధికారి విమల కుమారి, ఎంఈఓ యువిఎస్ శివాజీ వర్మ, మెంటాడ చల్లపేట పిహెచ్‌సి వైద్యాధికారులు జి.కల్పన, ఉష, మేడపల్లి హోమియోపతి డాక్టర్ శ్రీనివాసరావు, ఏపీవో చిన్నప్పయ్య, మెంటాడ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.అరుణ, వెలుగు సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కస్పా హైస్కూల్‌లో యోగ రిసోర్స్ పర్సన్‌లకు యోగాపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ సెక్రటరీ కే.కృష్ణరాజు, డైట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ లక్ష్మణరావు పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అదేవిధంగా డిఆర్‌పిలు తవితయ్య, సిహెచ్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు. చీపురుపల్లి డివిజన్ జిహెచ్‌ఎస్, రాజాంలో బొబ్బిలి డివిజన్ జడ్పీ హెచ్‌ఎస్, రామభద్రపురంలో నిర్వహించారు. బొబ్బిలి డివిజన్ కార్యక్రమం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ కార్యదర్శి నల్ల వెంకట నాయుడు పర్యవేక్షణలో నిర్వహించారు.

కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



విశాలాంధ్ర - దత్తిరాజేరు: టి.బూర్జివలస రైతు సేవ కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి అనురాధ ఆధ్వర్యంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సభకు ఏడీఏ మహారాజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు చట్టం ప్రకారం కౌలు రైతులకు పండించే పంటపై మాత్రమే హక్కు ఉంటుందని భూమిపై ఎటువంటి హక్కు ఉండదని, భూమి యజమానులు ముందుకి వచ్చి కౌలుకు సాగుచేస్తున్న రైతులకు సహకరించాలని కోరారు. ఈ కౌలు కార్డు కేవలం 11 నెలలకు మాత్రమే పనిచేస్తుందని అన్నారు. అనంతరం రాయితీపై ఇచ్చిన వ్యవసాయ యంత్ర పరికరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బంగారునాయుడు, రైతులు, విఆర్‌ఓ, ఎంపీఈవో లక్ష్మిపార్వతి పాల్గొన్నారు.

69 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో రూ.6.90 లక్షల జరిమానా

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: మద్యం సేవించి వాహనాలు నడిపి, పట్టుబడిన వాహనదారులు ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానాను విజయనగరం అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ఎస్.హెచ్.ఆర్. తేజ చక్రవర్తి విధించారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై విజయనగరం ట్రాఫిక్ సిఐ సూరి నాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, మద్యం సేవించి, వాహనాలు నడిపిన వారిపై 69 కేసులు నమోదు చేసి, విజయనగరం అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి వద్ద హాజరుపర్చగా మెజిస్ట్రేట్ ఎం.ఎస్.హెచ్.ఆర్. తేజ చక్రవర్తి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం 69 మందికి రూ.6.90 లక్షలను జరిమానగా విధించారని తెలిపారు. మద్యం సేవించి, వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నామని తెలిపారు.

31న పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర - వేపాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక పింఛన్లను వృద్ధులకు, దివ్యాంగులకు మే 31వ తేదీన పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ సీహెచ్. సూర్యనారాయణ తెలిపారు. ఆదివారం సెలవు దినం కావడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈనెల 31వ తేదీన, జూన్ 2వ తేదీన పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

బాబూ..సూపర్ సిక్స్ అమలెక్కడ...?

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పురం అప్పారావు

విశాలాంధ్ర - గజపతినగరం: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలును మరిచారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పురం అప్పారావు అన్నారు. గజపతినగరం గణేష్ కోవెల వద్ద గల నీళ్ల ట్యాంక్ ఆవరణలో జరిగిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వచ్చేనెల రెండవ తేదీన మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమంలో ఇల్లు, ఇళ్ల స్థలాలు లేని అర్హులైన వారందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. నేటి పాలకులు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలులో ఒక్క పింఛన్లు తప్ప మరి ఏదీ కూడా అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణరావు, ఆదినారాయణ, శ్రీను, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు కౌలు కార్డులు



విశాలాంధ్ర - గంట్యాడ: అర్హులందరూ కౌలు కార్డులు వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వీటీ రామారావు అన్నారు. మండలం రామవరం గ్రామంలో గురువారం జిల్లా వ్యవసాయ అధికారి వీటీ రామారావు అధ్యక్షతన కౌలు రైతుల ప్రయోజనములు గురించి సమావేశం జరిగింది. క్రాప్‌లోను పంటల ఇన్సూరెన్స్ పంట నష్ట పరిహారము విత్తనాలు ఎరువులు సబ్సిడీపై పొందుటకు అర్హులు అవుతారని అన్నారు. మండలంలో 975 మంది కౌలు రైతులు ఈ ప్రయోజనాలను పొందుటకు అర్హులని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్యామ్ కుమార్, గ్రామ సర్పంచ్, విఆర్‌ఓ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతోనే బాలల వికాసం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: గ్రంథాలయాలు బాలల వికాసానికి తోడ్పడతాయని విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మీ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ బాల్యం నుంచే పుస్తక పఠనం అలవాటు చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి పంచాయతీ స్థాయిలోనూ విద్యార్థులకు అందుబాటులో గ్రంథాలయం ఉండాలన్నారు. పిల్లలను కూర్చోబెట్టి పైకి వినిపించేలా పుస్తక పఠనం చేయిస్తే భాషా ఉచ్చారణ, పఠన సామర్థ్యము, కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతా యన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీలలో ఆసక్తిగా పాల్గొన్నారు. విజేతలకు పుస్తకాలను, పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేకా అనంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు అనంతలక్ష్మి, ఏపీ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ కార్యదర్శి సుభద్ర దేవి, మహిళా విభాగం అధ్యక్షురాలు పిన్నింటి కళావతి, సంఘం సలహాదారు కంచర్ల రాజేశ్వరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లెండికి ప్రతిష్టాత్మక టైర్-1 ఎన్.బి.ఏ అక్రిడిటేషన్

విశాలాంధ్ర - డెంకాడ: లెండి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో గల మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ విభాగాలలోని ఇంజనీరింగ్ విద్యలో చూపించిన అత్యుత్తమ ప్రతిభకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బిఏ) నుండి ప్రతిష్టాత్మక టైర్-1 అక్రిడిటేషన్‌ను పొందడం జరిగిందని సంస్థ ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. లెండి యొక్క విద్యా నైపుణ్యం, పరిశ్రమ-ఆధారిత పాఠ్యాంశాలు, అత్యాధునిక మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన అధ్యా పకులు, బలమైన ప్లేస్‌మెంట్ రికార్డు పట్ల నిబద్ధతకు నిదర్శనం అన్నారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ పి.మధుసూదనరావు మాట్లాడుతూ తమ సంస్థకు వచ్చిన ఈ టైర్ 1 ఎన్‌బిఏ గుర్తింపు మరింత బాధ్యతను పెంచుతుందని చెప్పారు. ఈ గుర్తింపు పట్ల వైస్ చైర్మన్ పి.శ్రీనివాసరావు, సెక్రటరీ కరస్పాండెంట్ కె.శివ రామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.రామారెడ్డి, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఈవీఎం గోదాములను కలెక్టర్ తనిఖీ

విశాలాంధ్ర - నెల్లిమర్ల: స్థానిక ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురువారం తనిఖీ చేశారు. గోదాములకు వేసిన సీళ్లను, తాళాలను పరిశీలించారు. సెక్యూరిటీపై సమీక్షించారు. అప్ర మత్తంగా ఉండాలని అధికారులను, పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఇన్‌ఛార్జ్ ఆర్డీఓ టి.సవరమ్మ, ఇన్‌చార్జి తహశీల్దార్ రవిశంకర్, కలెక్టరేట్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ శేఖర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ జి.ఈరన్న ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 30 సంవత్సరాలు గల టెన్త్ క్లాస్ నుండి డిగ్రీ పూర్తి చేసిన యువతీ, యువకులు అర్హులని, ఆసక్తి గల విద్యార్థులు కళాశాలకు వచ్చి జూన్ 4వ తేదీ లోపల రిజిస్టర్ చేసుకోవాలని, వివరాలకు 7995691295 సంప్రదించాలని కోరారు.

జూన్ 2 వరకు కౌలు రైతులు గుర్తింపు

విశాలాంధ్ర - వంగర: జూన్ 2వ తేదీ వరకు కౌలు రైతులు గుర్తింపు నిర్వహించనున్నట్టు మండల వ్యవసాయాధికారి తట్టికోట కన్నబాబు తెలిపారు. మండలంలో 19 గ్రామ సచివాలయాల పరిధిలో గల 29 గ్రామ పంచాయతీల్లోని 37 గ్రామాల్లో కౌలు రైతులను గుర్తించనున్నట్లు చెప్పారు. మండలంలో వీవీఆర్ పేట, రాజుల గుమ్మడ, వంగర, శివ్వాం, తలగాం, ఎం.సీతారాంపురం, సంగాం, మగ్గూరు గ్రామాల సచివా లయాల పరిధిలో గల గ్రామాల్లో కౌలు రైతులను గుర్తించనున్నట్లు వివరించారు. 30న మద్దివలస, కొప్పరవలస, కొప్పర, కొండ చాకరాపల్లి గ్రామాల్లో, 31న నమండలంలో బాగింపేట, శ్రీహరిపురం, అరసాడ, మద్దువలస గ్రామాల్లో, జూన్ 2న మండలంలో కోనంగి పాడు, మరువాడ, కింజంగి సచివాలయాల పరిధిలో కౌలు రైతులను గుర్తించనున్నట్టు చెప్పారు.

మంగళపాలెంలో భారీ చోరీ..

- 90 తులాల బంగారం, రూ.5 లక్షల నగదు అపహరణ

విశాలాంధ్ర - కొత్తవలస : మండలంలోని మంగళపాలెం గ్రామంలో గుర్తు తెలియని దుండగులు భారీ చోరీకి పాల్పడ్డ ఘటన గురువారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్ ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరగడం పలువుర్ని ఆశ్చర్యానికి గురిచేసింది. గురుదేవ హాస్పటల్, ట్రస్ట్ ప్రాంగణంతో పాటూ నివాస ప్రధాన ద్వారం వద్ద నిరంతరం సీసీ కెమెరాల పహారా ఉండగానే దుండగులు ఇంటి వెనుక నుంచి తలుపులు పగలగొట్టి ఈ చోరీకి పాల్పడటంతో పలు అనుమానాలకు తావిస్తోంది. దొంగలు ఇంటిని సుదీర్ఘ కాలంగా పరిశీలించి మాటువేసి తస్కరణకు పాల్పడ్డారా... లేక బాగా తెలిసిన వారేవరైనా ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. బాధితుడు జగదీష్ మాట్లాడుతూ రాత్రి చోరీ జరిగిందని బుధవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో గుర్తించినట్లు తెలిపారు. ఇంట్లోని పూజా మందిరంలో రాజరాజేశ్వరి అమ్మవారికి అలంకరించిన సుమారు

90తులాల బంగారు ఆభరణాలతో పాటూ రూ.5లక్షల నగదును గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్ళారన్నారు. స్థానిక సిఐ షణ్ముఖరావు, విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని స్పష్టం చేశారు.

కలుషిత నీరే శరణ్యమా....!

- ఏడాదిగా ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోని అధికారులు
- తాగునీటికి అవస్థలు పడుతున్న స్థానికులు

విశాలాంధ్ర - చీపురుపల్లి: ఏడాదికాలంగా తమకు సరఫరా అవుతున్న తాగునీటి పైపుల నుండి కలుషిత నీరు రావడంతో ఆ నీటిని తాగి వ్యాధుల బారిన పడాల్సిన దుస్థితి నెలకొందని పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల రేగిడి వీధివాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గురువారం వారికి సరఫరా అయిన కలుషిత నీటిని విలేకరులకు చూపించి వారి ఆవేదన వ్యక్తం చేశారు. చీపురుపల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా నివాసముంటున్న సభ్యులు నారాయణమ్మ, సాహిక, నిజాం బేగం, మదిల సరస్వతి, కిందేటి శ్రావణి, రాయి స్వర్ణకుమారి, హనుకూరి, శ్రీదేవి, ప్రసాదులు విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ పరిధి గొర్ల మండలంలో కొద్ది రోజుల క్రితం కలుషిత నీటిని తాగి మృత్యువాత పడిన బాధితులు మాదిరిగానే తమ బతుకులు తయారయ్యాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాదికాలంగా పంచాయతీ పైపులైను ద్వారా తమకు సరఫరా అవుతున్న తాగునీటిలో మురికితోపాటు కలుషిత వ్యర్థాలు కూడా సరఫరా జరుగుతుండడంతో ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వారు వాపోయారు. ప్రజా ప్రతినిధులు సైతం తమ సమస్యను పట్టించు కోకుండా ఫిర్యాదు చేసిన ప్రతిసారి కంటి తుడుపుగా చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని వారు వాపోయారు. కలుషిత నీటిని తాగడం వలన వాంతులు, విరేచనాలు, జ్వరాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నామని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న కలుషిత నీటిపై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

సమస్య పరిష్కరిస్తాం

పట్టణ పరిధిలో స్థానికుల ఫిర్యాదు మేరకు కలుషిత తాగునీటిపై సంబంధిత అధికారులతో సంప్రదిస్తాను. సమస్యను వీలైనంత త్వరితగతిన పరిష్కరించి కుళాయిల ద్వారా సక్రమమైన మంచినీరు సరఫరా అయ్యేలా చూస్తాం.

- ఎంపీడీవో ఎల్.త్రినాధరావు

సబ్సిడీపై పచ్చిరొట్ట, నవధాన్యాల విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర - శృంగవరపుకోట: మండలంలోని సంత గౌరమ్మపేట, కృష్ణాపురం గ్రామాలకు చెందిన రైతులకు రైతు సేవ కేంద్రం వద్ద సబ్సిడీపై, పచ్చిరొట్ట, నవధాన్యాల విత్తనాలను పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి కె.రవీంద్ర గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విత్తనాలను ఖరీఫ్ వరి పంటకు ముందు పొలాల్లో జల్లటం వలన భూసారం పెరిగి అధిక దిగుబడులు పొందవచ్చునని అన్నారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయం పట్ల ఆసక్తి చూపాలని ఏవో అన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ డి.కృష్ణ, రెండు గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న ముగ్గురి అరెస్ట్

విశాలాంధ్ర - నెల్లిమర్ల: నెల్లిమర్ల మండలం గొర్లెపేటలో పేకాట ఆడుతున్న ముగ్గురిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 15 వేల స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు. నెల్లిమర్ల మండలంలోని ఎక్కడైనా పేకాట ఆడినా, కోడి పందేలు నిర్వహించినా తమకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

ఇంగ్లీషు మిస్సింగ్ పదాలపై అవగాహన

విశాలాంధ్ర - తెర్లాం: తెర్లాం శాఖ గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రంధాలయ అధికారి సి. హెచ్.కృష్ణ మూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇంగ్లీష్ మిస్సింగ్ పదాలపై అవగాహన, భక్తి గీతాలు పాడించడం జరిగింది. విద్యార్థులకు రెండు గ్రూప్‌లగా విభజించి మిస్సింగ్ అయిన పదాలను పూర్తి చేసే వారిని విజేతలుగా ప్రకటించారు. కార్యక్రమంలో హైస్కూల్ క్రాఫ్ట్ టీచర్ కే.విస్సు, 13 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాంధ్రలో రిజిష్టర్ కావాలి

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో ప్రతిఒక్కరూ యోగాంధ్రలో రిజిష్టర్ కావాలని తహశీల్దార్ హేమంత్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వెలగవలస సచివాలయం నందు సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. యోగా కార్యక్రమంలో విరివిగా పాల్గొనాలని ఆదేశించారు.

గడువులోగా వీధి విక్రయదారుల సర్వే పూర్తి చేయాలి

విశాలాంధ్ర - విజయనగరం: నిర్దేశిత కాల పరిమితిలోగా వీధివిక్రయదారుల సర్వేను పూర్తి చేయాలని కార్యదర్శులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు గురువారం సాయంత్రం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వీధి విక్రయిదారులను గుర్తించి వారి వివరాలను నమోదు చేసుకోవాలని చెప్పారు. ఈనెల 31వ తేదీ కల్లా నివేదికలు సమర్పించాల్సి ఉందని కావున త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని సూచించారు.అర్హులైన వీధివిక్రయదారులను మాత్రమే గుర్తించి మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో టిపిఆర్ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు అవగాహన

విశాలాంధ్ర - గజపతినగరం: మండలంలోని కాలం రాజుపేట, పాత శ్రీరంగరాజపురం గ్రామాల్లో గురువారం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు గూర్చి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కౌలు కార్డులు వలన రైతులకు కలిగే ఉపయోగాలను వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరు కౌలు కార్డులు తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి గోవిందమ్మ, మండల వ్యవసాయ అధికారి సిహెచ్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని పరిశీలించిన నగరపాలక కమిషనర్

విశాలాంధ్ర - విజయనగరం: క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గురువారం వివిధ ప్రాంతాలలో పర్యటించిన విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పారిశుద్ధ్య విధానాలను గమనించారు. అక్కడక్కడ పేరుకుపోయిన చెత్తను తొలగించే విధంగా సిబ్బందికి ఆదేశించారు. కొన్నిచోట్ల కాలువలలో పూడిక చేరిపోవడాన్ని గమనించి వెంటనే జెసిబి, బాబ్ కార్ట్ ల సహాయంతో పూడికలను తొలిగించాలని సూచించారు. అనంతరం అన్న క్యాంటీన్ల చేరుకుని ప్రజాభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిలువలు లేకుండా ఎప్పటి కప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే ను డ్రైడేగా పాటించాలని అన్నారు. నీటి నిలువలు ఉండడం వల్ల దోమలు ఉత్పత్తి కేంద్రాలుగా మారుతాయని చెప్పారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని స్వయంగా ఎవరికివారు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా చేసుకోవాలని చెప్పారు.

నేడు రామ నారాయణంలో యోగాసనాల ప్రదర్శన

ఏర్పాట్లు చేస్తున్న జిల్లా అధికారులు



విశాలాంధ్ర - విజయనగరం: జిల్లా కేంద్రానికి సమీపంలోని ప్రముఖ పర్యాటక కేంద్రంగా విలసిల్లుతున్న రామ నారాయణం ఆధ్యాత్మిక కేంద్రంలో యోగాంధ్ర కార్యక్రమం శుక్రవారం ఉదయం నిర్వహించనున్నారు. రాష్ట్ర స్థాయిలో పర్యాటక ప్రాంతాల్లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించి దీనిలో భాగంగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించేందుకు జిల్లాలోని నాలుగు పర్యాటక ప్రాంతాలు ఎంపిక చేసింది. దీనిలో భాగంగా రామ నారాయణంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సుమారు 1500 మందితో ఇక్కడ యోగాసనాలు ఆరోజు ఉదయం 6-30 నుంచి 8 గంటల వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జూన్ 4న వెన్నుపోటు దినోత్సవం

జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విశాలాంధ్ర - చీపురుపల్లి: కూటమి ప్రభుత్వం ఏర్పడి జూన్ 4 నాటికి ఒక ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఆరోజుని వెన్నుపోటు దినోత్సవంగా ప్రకటిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మద్ది శ్రీనివాసరావు ప్రకటించారు. గురువారం చీపురుపల్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైనందున అందుకు నిరసనగా నియోజకవర్గ పరిధిలో నాయకులు కార్యకర్తలు అందరితో భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలో గల ముఖ్య నాయకులు కార్యకర్తలు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు. చీపురుపల్లి శివార్లలో గల పెట్రోల్ బంకు వద్ద నుండి చీపురుపల్లి పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ వరకు భారీ ర్యాలీతో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు చిన్న శ్రీను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వైఎస్ఆర్సిపి పిఏసి సభ్యులు బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజల పక్షాన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కూటమి ప్రభుత్వం పైన పోరాటం జరుపుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వెన్నుపోటు దినోత్సవ కార్యక్రమానికి హాజరై ప్రభుత్వానికి నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో చీపురుపల్లి నియోజకవర్గ నాయకులు కే.వీ.సూర్యనారాయణ రాజు, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాల నాయుడు, బెల్లాన వంశీ కృష్ణ, తాడ్డి వేణుగోపాల్, కోట్ల వెంకటరావు, బూర్లే నరేష్, మీసాల విశ్వేశరావు, వాకాడ శ్రీను, సీర అప్పలనాయుడు, కరిమజ్జి శ్రీను, బెల్లాన త్రినాథరావు, దన్నాన జనార్దన, పార్టీ అధ్యక్షులు, సర్పంచుల, ఎంపీటీసీలు ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డులకు గ్రామ సభ

విశాలాంధ్ర - గరివిడి: ఖరీఫ్ సీజన్లో భాగంగా వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు కలిసి గరివిడి మండలం తోండ్రంగి రైతు సేవ కేంద్రంలో గ్రామసభ నిర్వహించడం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన చీపురుపల్లి సహాయ సంచాలకులు (నియమిత) ఎస్.కోటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో గత ఖరీఫ్ 2024 సీజన్లో గరివిడి మండలంలో 387 మంది కౌలు రైతులను గుర్తించడం జరిగిందని ఈ సంవత్సరం టార్గెట్ 425 వరకు ఉందని అర్హులైన కౌలుదారులందరినీ గుర్తించి కౌలు కార్డులు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని దీనికి కౌలు రైతు వారి యొక్క ఫోటో ,ఆధార, యజమాని 1బి పత్రం తీసుకొని గ్రామ వ్యవసాయ సహాయకులు రెవిన్యూ అధికారిని సంప్రదించాలని అయన తెలియచేసారు. కౌలు గుర్తింపు కార్డు వలన రాయితీ పై విత్తనాలు,ఎరువులు,పంట నమోదు ప్రక్రియ సాగుదారుడు పై జరుగుతుందని, సాగుదారుడు నష్టపోకుండా వారికి రుణ సదుపాయం కూడా ఇవ్వడం జరుగుతుందని అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కూడా వారు లబ్ధి పొందుతారని ఆయన వివరించారు, ఈ కార్యక్రమంలో మండల వ్యవశాయ అధికారి వీ.శైలజ, గ్రామ వ్యవసాయసహాయకులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

మద్యం గొలుసు దుకాణాలకు సరఫరా చేస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - వేపాడ: గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం గొలుసు దుకాణాలకు మద్యం దుకాణదారులు మద్యం సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కొత్తవలస ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఎస్సై వి.ఎన్.రాజు అన్నారు.కొత్తవలస ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ జీవీఎస్ రాజశేఖర్ నాయుడు ఆదేశాల మేరకు గురువారం మండలంలోని సిండికేట్ మద్యం దుకాణాలను ఆయన తనిఖీ చేసే అన్ని దుకాణాలు సక్రమంగా నడవడంతో సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖ ఎస్సై వి.ఎన్. రాజు మాట్లాడుతూ గ్రామాల్లో గొలుసు దుకాణాలకు మద్యం షాపుల నుండి మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే మద్యం దుకాణాలలోకి బయటి వ్యక్తిలను అనుమతించరాదని, ఒక వ్యక్తికి మూడు మద్యం సిసాలకంటే ఎక్కువ అమ్మకూడదని,ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ రేట్లకే మద్యం అమ్మాలని,అలాగే మద్యం దుకాణాల్లో రికార్డులను ఏ రోజుకు ఆరోజు సక్రమంగా నమోదు చేయాలని,మద్యం దుకాణాల లోపల బయట పరిశుభ్రత పాటించాలని, మద్యం దుకాణాల ఆవరణలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించరాదని, అలా కాకుండా నిబంధనలకు విరుద్ధంగా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.అనంతరం కృష్ణా రాయుడుపేట,కుమ్మపల్లి గ్రామాలలో నాటుసార,బెల్లపు ఊటలకై తనిఖీలు నిర్వహించారు.గ్రామ పెద్దలను కలిసి నాటు సారా తయారీదారులు అమ్మకం దారులు పట్టుపడితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎక్సైజ్ శాఖ సిబ్బంది హెచ్ సి ప్రసాద్, పిసి హరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జిందాల్ భూ నిర్వాసితుల సమావేశం వాయిదా

విశాలాంధ్ర - శృంగవరపుకోట: జిందాల్ భూ నిర్వాసితుల సమస్యలపై గురువారం నిర్వహించాల్సిన సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. భూ నిర్వాసితులకు సమస్యలకు సంబంధించి చర్చించడానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, త్వరలో ప్రభుత్వ పెద్దలు దీనిపై కూర్చుని మాట్లాడదామని సమాచారం పంపారన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈసమావేశం ప్రభుత్వ పెద్దలు స్పందించడంతో వాయిదా వేయాలని నిర్ణయించామన్నారు. ఈ నిర్ణయాన్ని సమావేశంలో పాల్గొనే అందరితో మాట్లాడి నిర్ణయించామన్నారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు చివరి వరకు వారితో ఉండి పోరాటం చేస్తామన్నారు. అతి త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిర్వాసితులు 17సంవత్సరాల క్రితం ఉద్యోగాలు వస్తాయని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని సన్న,చిన్న ప్రధానంగా గిరిజనులు భూములిచ్చారన్నారు.

ఉద్యోగాలు రాక ఎటూవెళ్లలేక యువత సందిగ్ధంలో పడి ఖాళీగా ఉండిపోయిందన్నారు. కనీస వేతనాలు ఇస్తున్నా, పూర్తి స్థాయిలో ఉద్యోగం ఇస్తేనే యువత పురోగతి ఉంటుందన్నారు. షేర్ హోల్డర్లుగా ఉన్న రైతులకు ఇప్పటి పెరిగిన ధరలకు అనుగుణంగా చెల్లింపులు చేయాలని కోరుతున్నామన్నారు. ఎంఎస్ఎంఈ పార్కుకు, ప్రభుత్వానికి మేము ఎంతమాత్రం వ్యతిరేకం కాదన్నారు. ఎంఎస్ఎంఈ పార్కు రావాలని, ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు కలగాలని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని కోరుకుంటున్న వాళ్లలో మేము ముందుంటామన్నారు. ఈ ఉద్దేశ్యం తోనే రైతులను ఒప్పించి అప్పట్లో జిందాల్ పరిశ్రమకు భూములిప్పించామన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఈప్రాంత రైతులకు న్యాయం చేస్తుందన్న నమ్మకం ఉందని. ఇందుకోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు.

జెఎన్‌టియు జివిలో ఆన్‌లైన్ యోగా కార్యక్రమం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం గురజాడ విజయనగరంలో రాబోయె అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యూనివర్సిటీ పరిధిలో గల అనుబంధ కళాశాలలో ఒక నెలరోజుల పాటు ఈనెల 21 నుండి వచ్చే నెల 21 వరకు ప్రతీ రోజు ఉదయం 6 -7 గంటల మధ్య ఆన్ లైన్ విధానంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం జెఎన్‌టియు జివి లో యోగా కార్యక్రమాన్ని (ఆఫ్ లైన్ విధానములో) నిర్వహించారు. ఈ కార్యక్రమములో పాల్గొన్న జె ఎన్ టి యు జి వి జేఎన్ఇన్‌ఛార్జ్ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి మాట్లాడుతు, రాబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు అనుసరించి యూనివర్సిటీ పరిధిలో ఈ యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నమన్నారు అదేవిదంగా ప్రతీ ఒక్కరు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన యోగాంధ్ర యాప్ లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతీ రోజు యోగా చేస్తు తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, యోగా ద్వారా మానసిక ఉల్లాసానికి, నిత్యం ఉత్సాహవంతులుగా ఉండేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఈ యోగ కార్యక్రమం యోగా బోధకుడు ఎస్.రవివర్మ, పర్య వేక్షణలో జరిగింది. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్. జి. జయసుమ, జేఎన్టీయూజీవి ఇంజనీరింగ్ కాలేజీ, ఇంచార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్. ఆర్.రాజేశ్వరరావు, విశ్వవిద్యాలయ డైరెక్టర్లు, డాక్టర్ ఆర్. గురునాధ, పరీక్షల నియంత్రణాధికారి, డాక్టర్ జి. అప్పలనాయుడు, విశ్వవిద్యాలయ క్రీడలు సమన్వయకర్త, డాక్టర్ ఎ.వి.పాపారావు, కళాశాల క్రీడలు సమన్వయకర్త, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో పుణ్య శ్లోక అహిల్యభాయి హోల్కర్ జయంతి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో విజయనగరం రోటరీ క్లబ్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షులు ఉప్పలపాటి రాజేష్ వర్మ అధ్యక్షతన

పుణ్య శ్లోక అహిల్యభాయి హెరాల్కర్ 300వ జయంతి సందర్భంగా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి గా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పీవీఎన్ మాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈమె మహిళ అయిన భారత దేశంలో అనేక దేవాలయాలను నిర్మాణం చేశారన్నారు. రాజు ధర్మం కేవలం శాసనాలు చేయడమే కాదు ప్రజలకు సేవ చేయడం కూడా అని అన్నారు. ఆవిడ భర్త అతి తక్కువ వయసులో చనిపోయిన కూడా ఆ సంస్థానంలో ప్రజలకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరిపాలించిన వనిత అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, పార్లమెంట్ కన్వీనర్ సంబర లక్ష్మీనరసింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమంచి సుబ్బారావు, కోటగిరి నారాయణరావు, మహిళామోర్చా రాష్ట్ర కార్యదర్శి పాక నాగ మల్లిక పాల్గొన్నారు.

కడప దర్గాను దర్శించుకున్న ఎమ్మెల్యే బేబీ నాయన

విశాలాంధ్ర - బొబ్బిలి: కడపలో జరుగుతున్న టీడీపీ మహానాడుకు హాజరై ఎమ్మెల్యేఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) నిన్న మధ్యాహ్నం ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా కొలిచేకడప దర్గానదర్శించుకున్నారు. దర్గా పెద్దలు ఎమ్మెల్యే గారికి స్వాగతం పలుకగా బేబీనాయన చాదర్ సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

సీజనల్ వ్యాధులు ప్రభాలకుండా అప్రమత్తంగా ఉండాలి

గ్రామీణ వైద్యులు సంక్షేమ సంఘం అధ్యక్షులు కనకచారి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: వాతావరణ పరిస్థితులు బట్టి రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్న కారణంగా సీజనల్ వ్యాధులు జ్వరాలు, జలుబు, దగ్గు, డైయారియా, కలరా లాంటి వ్యాధులు ప్రభాలే అవకాశం ఉంది కావున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కనకాచారి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పరిసరాలు పరిశుభ్రత పాటించాలని వేడి నీళ్లు, వేడి ఆహారం తీసుకోవాలని నిల్వ ఉన్న ఆహారం తీసుకోవద్దు అని సూచించారు. సంఘం గౌరవ అధ్యక్షులు ఐ.గోపాలరావు మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన మురికివాడ ప్రాంతంలో ఉండే గ్రామీణ వైద్యులు ప్రజలకు సీజనల్ వ్యాధులు మీద అవగాహన కల్పించి ప్రజలు అనారోగ్యం పాలు కాకుండా చూడాలని కోరారు. అనుకోకుండా వ్యాధులు ప్రాబిలిన ప్రజలకు ప్రభుత్వ హాస్పిటల్‌కి పంపించి తగిన సలహాలు ఇచ్చి గ్రామీణ ప్రాంతంలో ప్రధమ చికిత్స మాత్రమే చేయలని పిలుపునిచ్చారు.

కొఠియా సమస్య పరిష్కారానికి ప్రభుత్వాలు చొరవ చూపాలి

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు

విశాలాంధ్ర - విజయనగరం: సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా వున్న కొఠియా గ్రామాల వివాదాన్ని పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు కోరారు. ఇటు ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌డిఏ కూటమి అధికారంలో వుండడం, అటు ఒడిశా బిజెపి పాలిత రాష్ట్రంగా వున్న నేపథ్యంలో కొఠియా గ్రామ సమస్య పరిష్కరానికి ఇదే తగిన సమయమని డాక్టర్ శంకరరావు పేర్కొన్నారు. గతంలో సుప్రీం కోర్టు కూడా ఈ సమస్య కు రాజకీయ,పరిపాలనా పరమైన పరిష్కారాలు చూడాల్సిన అవసరం ఉందని చెప్పిందని, ఆయా గ్రామాల ప్రజాభిప్రాయానికి విలువనిస్తూ వారి సంక్షేమం, అభివృద్ధికి ఆటంకం కలగకుండా సమస్య పరిష్కరించాల్సి వుందన్నారు. ఈ మేరకు కేంద్ర గిరిజన శాఖ కు, రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీ ఎస్టీ కమిషన్ లేఖ రాయడం జరిగిందని తెలిపారు. కొఠియా సమస్య పరిష్కారానికి కేంద్రం సారథ్యంలో కమిటీ వేయాలని,ఆంధ్ర, ఒడిశా ప్రభుత్వాలు కొఠియా గ్రామాల సమస్య పరిష్కారానికి తమవంతు సహకారం అందించాలని కోరారు.

సాయిబాబా ఆలయంలో పాలాభిషేకాలు

జూన్ 5న ఆలయ శిఖర ప్రతిష్ట

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: పట్టణంలో ధర్మపురిరోడ్డు వద్ద ఉన్నదత్త సాయి సమర్థ పీఠంలో గురువారం సాయిబాబా ఉత్సవ విగ్రహానికి సమర్థ సాయి సుందర మహారాజ్

ఆధ్వర్యంలో రామకృష్ణ శర్మ చేతులు మీదుగా పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి సుందర మహారాజ్ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోనే మొదటిగా దత్త సాయి సమర్థ పీఠంలో ఉన్న సాయిబాబా విగ్రహాన్ని ప్రతిష్టించడం జరిగిందన్నారు. అప్పటినుండి నేటి వరకు అనేక కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి గురువారం సాయిబాబాకు పాలాభిషేకం, సాయంత్రం పల్లకి ఉయ్యాల సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా జూన్ 5వ తేదీన దత్త సాయి సమర్థ పీఠఆలయ శిఖర కలశ పున ప్రతిష్టకార్యక్రమాలను ఉదయం 8.30 నిమిషాల నుండి నిర్వహిస్తున్నామన్నారు. ఆరోజు దేవాలయంలో ఉదయము నుండే వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించి అనంతరం ప్రసాద వితరణ జరుగుతుందన్నారు . కావున ఎంతో ఘన చరిత్ర గలిగిన దత్త సాయి సమర్థ పీఠం ఆలయ శిఖర కలశ పునర్ ప్రతిష్ట మహోత్సవానికి భక్తులంతా హాజరు కావాలని కోరారు.

కౌలు గుర్తింపు కార్డులకు గ్రామ సభ

విశాలాంధ్ర - డెంకాడ: డెంకాడ మండలంలో ఖరీఫ్ సీజన్లో భాగంగా వ్యవసాయ రెవెన్యూ శాఖలు కలిపి డెంకాడ రైతు సేవ కేంద్రంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సహాయ సంచాలకులు ఏ.నాగభూషణరావు హాజరై మాట్లాడుతూ మండలంలో గత ఖరీఫ్ 2024 సీజన్లో 320 మంది కౌలు రైతులను గుర్తించడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం టార్గెట్ 340 వరకు ఉందని, అర్హులైన అయినా కౌలుదారులందరినీ గుర్తించి కౌలు కార్డులు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్యాడ్మింటన్ టోర్నీ

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: శృంగవరపుకోట కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాలలో గత 29 రోజులుగా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, వారి మిత్రబృందం, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్‌ల సహకారంతో జరుగుచున్న వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం చివరి దశకు చేరుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న టోర్నమెంట్ క్రీడాకారుల మధ్య జోరుగా హుషారుగా సాగుతుందని చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. ఇదే శిక్షణ శిబిరంలో కోచ్ శ్రీరాములు వద్ద బ్యాడ్మింటన్ లో శిక్షణ పొంది, ఉన్నత చదువులు చదువుకున్న దేవికారాణి అనే అమ్మాయి ప్రస్తుతం హైదరాబాదులో సాఫ్ట్వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తూ గేమ్‌పై ఉండే మమకారానికి గుర్తుగా ఆమె తండ్రి కిరణ్ తో కలిసి శిక్షణ శిబిరానికి వచ్చి చిన్ననాటి బ్యాడ్మింటన్ జ్ఞాపకాలను నెమరు వేసుకుంది. ప్రస్తుతం ఇదే శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్న రాష్ట్రస్థాయి క్రీడాకారిని భరణికాన హారికకు 5000 వేల రూపాయల విలువైన యోనెక్స్ రాకెట్ను క్రీడాకారుల చప్పట్లు మధ్య అందజేశారు. అనంతరం క్రీడాకారులకు తండ్రి కిరణ్‌తో కలిసి క్రీడాకారులకు పౌచికాహారం గ్రుడ్డు, పాలు పంపిణీ చేశారు. శుక్రవారంతో ఈ టోర్నమెంటు ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ మహమ్మద్ ఖలీల్ ఉల్లా, ఇతర కోచ్ లు బి.హారిక, పి మౌనిక, శ్రీహరి చందన్, కుశల్ కుమార్, జాన్సన్, సుమన్,శశి, భార్గవ్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.